మరమ్మతుల్లో భాగంగా వేసిన మట్టి రోడ్డు వరకు చేరిన వరద

మేడిగడ్డపై మరో కుట్ర!

మొదటిపేజీ తరువాయి...

నేపథ్యంలో బరాజ్‌లో గతంలో వాటర్ డైవర్షన్ చేసి నీటిని కుంగిన పిల్లర్ల వైపు వెళ్లకుండా చర్యల చేపట్టారు. బరాజ్ ఒకటో పిల్లర్ నుంచి 22వ పిల్లర్ వరకు వదరనీరు వెళ్లకుండా మట్టిరహదారి వేసి వాటర్ పంపింగ్ మోటర్లతో దారి మళ్లించారు. ఆది వారం బరాజ్ ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద కుంగిన పియర్ల వైపు వచ్చి చేరుతున్నది. ఇది మేడిగడ్డపై మరో క్రుట కోణంలో భాగమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడో బ్లాక్‌వైపు నీరు వెళ్లకుండా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. దీంతో వరద నీటిని కుంగిన పియర్లవైపు కావాలనే వెళ్లేలా చేశారా? అనే అనుమానాలు తలెత్తున్నాయి. బరాజ్ డౌన్‌స్ట్రీమ్ (బరాజ్ దిగువ ప్రాంతం)లో సైతం వాటర్ డైవర్షన్ పనులు పూర్తిగా నత్తనడక సాగుతున్నాయి. భారీగా వరదనీరు వస్తున్న తరుణంలో ఎడవ బ్లాక్ వైపు చేరుతున్న వరద నీటిని ఎప్పటికప్పుడు డైవర్షన్ చేయాల్సిన ఉండగా, బరాజ్ వద్ద అందుబాటు ఉన్న 7 యంత్రాల్లో కేవలం ఒక పంపింగ్ మోటర్‌తో ఏడో బ్లాక్ వద్ద పైపులతో వాటర్ డైవర్షన్ చేస్తున్నారు. మిగతా పంపింగ్ యంత్రాలను ఒడ్డుకు చేర్చారు. దీని వెనక ఉన్న మతలబేంటో తెలియరాలేదు. ఇది అధికారుల నిర్లక్ష్యానికి కారణమా? పై నుంచి వస్తున్న ఒత్తిళ్లతో చేసేదేమీ లేక తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కసారిగా భారీ స్థాయిలో వరద నీరు పెరుగుతున్నప్పుడు సంబంధిత శాఖ అధికారులు బరాజ్ వద్ద అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలి. కానీ, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేడిగడ్డ వద్ద నత్తనడకన సాగుతున్న పనులు

ఒడ్డుకు చేర్చిన వాటర్ పంపింగ్ యంత్రాలు

సాగర్ ఆయకట్టు ఇక బీడే!

- ప్రాజెక్టు నిర్మాణంలోనే తెలంగాణకు ద్రోహం
- ఆంధ్రా పెత్తనంతో వారికి అనువుగా నిర్మాణం
- ఎగువన ఎడమకాల్వ, దిగువన కుడికాల్వ ఏర్పాటు
- 300 అడుగుల కంటే తక్కువగా నీరు ఉన్నా ఆంధ్రాకు నీళ్లు
- 510 అడుగుల కంటే ఎక్కువగా ఉంటేనే తెలంగాణకు నీళ్లు
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకూ ఇష్టానుసారంగా నీళ్ల తరలింపు
- మన వాటా నీటిని రెండు పంటలకు ఇచ్చిన బీఆర్ఎస్ సర్కార్
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో సాగర్ డ్యాం కేంద్రం ఆధీనంలోకి..
- మళ్లీ తెలంగాణ ప్రజలకు తప్పని నీటి కష్టాలు

నాగార్జునసాగర్ డ్యాంపై మోహరించిన సీఆర్పీఎఫ్ బలగాలు

నందికొండ, ఫిబ్రవరి 18: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్తే రానున్న రోజుల్లో దీని పరిధిలోని తెలంగాణ ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతాయని మాజీ ఇరిగేషన్ ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణం నుంచే తెలంగాణకు అన్యాయం జరిగిందని గుర్తుచేస్తున్నారు. పూర్తిగా తెలంగాణకు ఉపయోగపడే విధంగా నిర్మించాల్సిన నాగార్జునసాగర్ డ్యాంను 40 కిలోమీటర్లు ముందుకు తీసుకొచ్చి ఆంధ్రా ప్రాంతానికి ఎక్కువ లాభం చేకూరేలా నిర్మించారని వివరిస్తున్నారు. తెలంగాణకు నీళ్లు పారే ఎడమకాల్వను 510 అడుగుల కంటే ఎక్కువగా నీరు ఉంటేనే వాడుకొనేవిధంగా, ఆంధ్రా ప్రాంతానికి వెళ్లే కుడికాల్వను 300 అడుగుల కంటే తక్కువగా నీరు ఉన్నా వాడుకొనే విధంగా ఏర్పాటుచేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రా పాలకులు తెలంగాణకు రావాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేఆర్ఎంబీకి తప్పుడు లెక్కలు చూపుతూ తమ ప్రాంతానికి తరలించుకొని పోయారని గుర్తుచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు వచ్చిందని వివరిస్తున్నారు. గత పదేండ్లలో కృష్ణా నది నుంచి తెలంగాణకు రావాల్సిన వాటాను కచ్చితంగా వాడుకుంటూ, ఎడమ కాల్వ పరిధిలోని లక్షల ఎకరాల ఆయకట్టుకు ఏటా రెండు పంటలకు సాగునీరు అందించిందని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీకి అప్పగిస్తే రానున్న రోజుల్లో తెలంగాణలోని సాగు భూములు నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందని, భూములన్నీ బీళ్లుగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నాగార్జునసాగర్‌పై ఆంధ్రా పెత్తనం

తెలంగాణ ఆధీనంలో ఉండాల్సిన నాగార్జునసాగర్ డ్యాం నిర్వహణను అడ్డుకునేందుకు ఇటీవల ఆంధ్రా పాలకులు పోలీస్ బలగాల సాయంతో అర్ధరాత్రి డ్యాంపైకి చొరబడింది. ఇదే అదునుగా భావించిన కేంద్రం నాగార్జునసాగర్‌ను కేఆర్ఎంబీ ఆధీనంలోకి తీసుకెళ్లే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. డ్యాం కేంద్రం ఆధీనంలోకి వెళ్తే ఆంధ్రా పాలకులు గతంలో మాదిరిగానే నీటిని ఇష్టానుసారంగా తరలించుకుపోతారు. తెలంగాణకు రావాల్సిన నీటి వాటా రాకపోవడంతో ఎడమకాల్వ ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డ్యాంపైకి వెళ్లే పరిస్థితి లేదు

నాగార్జునసాగర్‌ను సీఆర్పీఎఫ్ బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నప్పటి నుంచి తెలంగాణ బలగాలను డ్యాంపైకి అనుమతించడం లేదు. విధుల్లోకి వెళ్లే తెలంగాణ ఉద్యోగులు కేవలం 13వ గేటు వరకే వెళ్తున్నారు. అది దాటి వెళ్లాలంటే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆంధ్రా ప్రాంతం మాచర్ల లోని తమ కమాండెంట్ దగ్గరకు వెళ్లి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో కుడికాల్వ గేట్లకు సంబంధించి విద్యుత్తు సరఫరా, ఆపరేటింగ్ అంతా తెలంగాణ నుంచే జరిగేది. సీఆర్పీఎఫ్ బలగాలు రాగానే ఆంధ్రా పాలకులు కుడికాల్వ నిర్వహణను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇప్పుడే పరిస్థితులు ఇలా ఉంటే కేంద్రం ఆధీనంలోకి నాగార్జునసాగర్ డ్యాం వెళ్తే తెలంగాణకు నీటి కష్టాలు తప్పవు.

సీఎం వ్యాఖ్యలు అబద్ధం

- 'మేడిగడ్డ'ను ఒప్పుకోలేదనడం అసత్యం
- అందుబాటులో లేకపోవడం వల్లే సంతకం చేయని శ్యాంప్రసాద్‌రెడ్డి
- 'కాళేశ్వరం-తెలంగాణ జీవధార' పేరిట పుస్తకాన్ని ప్రచురించిన విశ్రాంత ఇంజినీర్లు
- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఖండన

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణాన్ని విశ్రాంత ఇంజినీర్లు అంగీకరించలేదంటూ అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని రిటైర్డ్ ఇంజినీర్లు పేర్కొన్నారు. నిర్మాణానికి అంగీకరించకపోవడానికి గల పరిస్థితులు వేరని, సీఎం వెల్లడించిన అంశాలు వేరని స్పష్టంచేశారు. మేడిగడ్డ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే 'కాళేశ్వరం-తెలంగాణ జీవధార' పుస్తకాన్ని ఎందుకు తీసుకొస్తామని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ఇలాంటి ఆరోపణలు సరికాదని హితవు పలికారు. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించి ఎల్లంపల్లి వరకు కాలువ ద్వారా గోదావరి జలాలను తరలించాలని తొలుత నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్లు స్వతంత్రంగా ఒక కమిటీ ఏర్పాటు చేసుకుని బరాజ్ ప్రతిపాదిత అంశాలను పరిశీలించారు. మేడిగడ్డ నుంచి కాలువ నిర్మించి ఎల్లంపల్లి వరకు జలాలను తరలించడం కష్టమని అభిప్రాయపడ్డారు. తమ్మిడిహట్టి వద్ద లేదంటే వేమనపల్లి వద్ద బరాజ్ నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఆ తర్వాత ఇదే అంశంపై వ్యాప్కోస్‌తో సర్వే చేయించగా, ఆ మార్గంలో 22 క్లిష్టమైన పాయింట్లు ఉన్నట్టుగా తేలడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పలు సమీక్షల అనంతరం మేడిగడ్డ నుంచి కాలువ ద్వారా కాకుండా, నదీ మార్గంలోనే ఎగువ ఎల్లంపల్లి వరకు జలాలను తరలించాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు రిటైర్డ్ ఇంజినీర్ విద్యాసాగర్‌రావు తోపాటు ఇతర విశ్రాంత ఇంజినీర్లందరూ ఏకీభవించారు. మేడిగడ్డ నుంచి జలాలను తరలించేందుకు చేసిన అలైన్‌మెంట్‌కు సంబంధించిన ప్రాథమిక ప్రతిపాదనలపై తాము వ్యక్తం చేసిన అభ్యంతరాలను మొత్తంగా మేడిగడ్డ వద్ద బరాజ్‌నే వ్యతిరేకించినట్టు సీఎం రేవంత్ చెప్పడాన్ని ఖండించారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించేడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విభేదిస్తే పుస్తకం ఎందుకు?

మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణాన్ని, రీ ఇంజినీరింగ్‌ను విశ్రాంత ఇంజినీర్లు వ్యతిరేకించారని చెప్పడాన్ని కూడా పలువురు ఖండించారు. ప్రాథమిక అలైన్‌మెంట్‌ను మాత్రమే విభేదించామని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బరాజ్‌ను, రీ ఇంజినీరింగ్‌ను తాము వ్యతిరేకించడం నిజమైతే విశ్రాంత ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యంలో 'కాళేశ్వరం-తెలంగాణ జీవధార' అనే పుస్తకాన్ని ఎందుకు తీసుకొస్తామని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు రీడిజైనింగ్, కరెంటు చార్జీలు, బరాజ్ నిర్మాణం తదితర అంశాలపై టీజేఏసీతోపాటు, అనేకమంది లేవనెత్తిన సాంకేతిక అంశాలపై ఆ పుస్తకంలో సంపూర్ణ వివరణలు ఇచ్చామని గుర్తుచేస్తున్నారు. ప్రాజెక్టును సమర్థించకుంటే తామెందుకు అలా చేస్తామని ప్రశ్నించారు. ప్రాజెక్టుపై బుదర జల్లే ప్రయత్నాలు మానుకుని, లోపాలను గుర్తించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విశ్రాంత ఇంజినీర్లు సూచించారు.

సంతకం పెట్టకపోవడానికి కారణం వేరే

మేడిగడ్డ బరాజ్‌కు సంబంధించి విశ్రాంత ఇంజినీర్ల కమిటీ ఇచ్చిన నివేదికపై విశ్రాంత ఇంజినీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి సంతకం పెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించడం కూడా అసత్యమే. వాస్తవం ఏమిటంటే.. విశ్రాంత ఇంజినీర్ల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. అది వారు స్వతంత్రంగా ఏర్పాటు చేసుకున్న కమిటీ. వారు స్వతంత్రంగా అధ్యయనం చేసి రూపొందించిన నివేదిక అది. తేదీలు కూడా లేకుండా దానిని వారు బయటపెట్టారు. ఆ నివేదికపై శ్యాంప్రసాద్‌రెడ్డి సంతకం పెట్టకపోవడానికి, మేడిగడ్డ బరాజ్‌ను వ్యతిరేకించడానికి ఎలాంటి సంబంధం లేదు. ఇదే విషయమై శ్యాంప్రసాద్‌రెడ్డిని 'నమస్తే తెలంగాణ' సంప్రదించింది. నివేదికపై అందరూ సంతకాలు పెట్టిన రోజున తాను హైదరాబాద్‌లో లేనని, కాబట్టే సంతకం పెట్టలేకపోయానని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

అవాస్తవాల శ్వేతపత్రం!

- ప్రాజెక్టులపై అడ్డగోలుగా దుష్ప్రచారం
- తప్పల తడకగా ఆయకట్టు వివరాలు
- కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై కాంగ్రెస్ సర్కారు అసత్యాలు
- ఇన్వెస్టిగేషన్ పూర్తికాకుండానే కాళేశ్వరంపై బురదజల్లే యత్నాలు
- ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ నివేదికలే సాక్షి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో 'ఖర్చు బారెడు ఫలితం జానెడు' అన్నట్టుగా ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగిందని, రూ.వేల కోట్లు ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుల్లో అసలు ఆయకట్టే లేదని, కేవలం కొన్ని ప్రాజెక్టుల్లోనే నామమాత్రపు ఆయకట్టు సాధించారని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అడ్డగోలు వాదన చేస్తున్నది. కొన్ని ప్రాజెక్టులపై చేసిన ఖర్చు, పారిన ఆయకట్టు వివరాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నది. కానీ, ఈ వాదనలో ఏమాత్రం వాస్తవం లేదని, బీఆర్ఎస్ కీర్తిని మసకబార్చేందుకే రేవంత్‌రెడ్డి సర్కారు ఈ అసత్య ప్రచారానికి తెరలేపిందని స్పష్టమవుతున్నది. వాస్తవానికి ఏ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణంలో అయినా తొలుత హెడ్ వర్క్స్ (డ్యామ్‌లు, బరాజ్‌లు, స్పిల్‌వే గేట్లు, జలాశయాల పనులు) పూర్తి చేస్తారు. ఎత్తిపోతల పథకాలైతే పంప్‌హౌస్‌లు, సర్జిపూల్స్, విద్యుత్తు సబ్‌స్టేషన్లు, విద్యుత్తు లైన్లు, డెలివరీ సిస్టర్న్‌లు తదితర అనుబంధ నిర్మాణాలు పూర్తి చేస్తారు. వాటి పైనే ప్రభుత్వాలు నిధులు ఖర్చు చేస్తాయి. ఆ తర్వాతనే ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాన్ని చేపడతాయి. ఎందుకంటే.. అవి నిర్మించకుండా ఆయకట్టుకు నీరివ్వలేరు కాబట్టి. ఉమ్మడి ఏపీలో నిర్మితమైన నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, జూరాల తదితర ప్రాజెక్టుల పనులు ఇదే రీతిలో జరిగాయి. 1963లో శంకుస్థాపన జరిగిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో హెడ్‌వర్క్స్ పూర్తయిన తర్వాత 1975లో తొలిసారి 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఆ తర్వాత దశల వారీగా ఆయకట్టును పెంచుతూ పోయారు. తద్వారా 2008-09 నాటికి ఆయకట్టు 9 లక్షల ఎకరాలకు చేరుకున్నది. అంతే తప్ప ఈ మొత్తం ఆయకట్టు ఒకేసారే సాగులోకి రాలేదు. ఇతర అన్ని ప్రాజెక్టుల్లోనూ ఇదే ప్రక్రియ కొనసాగింది. కానీ, గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ప్రాజెక్టుల ప్రధాన పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. దీంతో సాగునీటి వసతుల కల్పనలో తెలంగాణ గత 8 ఏండ్లలో ఏకంగా 76.92% వృద్ధిని నమోదు చేసింది. తద్వారా దేశంలో అత్యధిక సాగునీటి వసతి కలిగిన టాప్-10 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది.

ప్రాజెక్టుల రీడిజైన్‌తోనే తెలంగాణకు మేలు

రీడిజైన్‌తో ప్రాజెక్టులను నాశనం చేశారని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్నది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేపట్టిన ప్రాజెక్టులన్నీ ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైనవే. ఆయా ప్రాజెక్టుల్లో ఉన్న సాంకేతిక, అంతర్రాష్ట్ర సమస్యలతోపాటు నీటి లభ్యత, నీటినిల్వ, పర్యావరణ, వన్యప్రాణి సంరక్షణ, ముంపు బాధితుల పునరావాస సమస్యలను తొలగించుకోవడానికి రీ ఇంజినీరింగ్ చేపట్టాల్సి వచ్చింది. తద్వారా అనుమతులను త్వరగా సాధించుకోవడానికి, పనులను వేగవంతంగా నిర్వహించుకోవడానికి వీలైంది. రీ ఇంజినీరింగ్ ప్రాజెక్టుల్లో అత్యధికంగా విమర్శలకు గురవుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం 2016లో ప్రారంభమైంది. 2019 నాటికి మేడిగడ్డ మొదలుకొని కొండపోచమ్మ జలాశయం వరకు అన్ని హెడ్‌వర్క్స్‌ను పూర్తి చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.93,872 కోట్లు ఖర్చు పెట్టింది. అయినా ఆ మూడేండ్లలోనే మొత్తం ఆయకట్టు రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శిస్తున్నది. దీన్ని బట్టి విమర్శకులకు కాళేశ్వరం ప్రాజెక్టు స్వరూపం తెలియదని స్పష్టమవుతున్నది. ఎందుకంటే కాళేశ్వరం హెడ్ వర్క్స్‌లో అన్నారం, సుందిల్ల, మేడిగడ్డ బరాజ్‌లే కాకుండా ప్రధాన పనుల కాంపొనెంట్స్ వందల సంఖ్యలో ఉన్నాయి. గోదావరి జలాల్లో తెలంగాణకు ఉన్న వాటాను సమర్థంగా వినియోగించుకునేందుకు చేపట్టిందే కాళేశ్వరం. తెలంగాణలో మధ్య గోదావరి సబ్ బేసిన్‌లోని కడెం, స్వర్ణ నదులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు దిగువన గోదావరిలో కలుస్తాయి. వాటి ద్వారా వచ్చే నీరు ఎల్లంపల్లి బరాజ్‌లోకి చేరుతాయి. మా నేరు సబ్ బేసిన్‌లో నీటి ప్రవాహాలు చాలా స్వల్పం. వాస్తవానికి ఏటా 1,500 నుంచి 3,000 టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయి. ఆ నీరంతా గోదావరిలో ప్రాణహిత, ఇంద్రావతి, శబరి నదులు కలిసిన తర్వాతే వస్తున్నట్టు ఇంజినీర్లు గమనించారు. భారీ ప్రవాహాలన్నీ పెన్‌గంగ, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి సబ్ బేసిన్‌ల నుంచి దిగువ గోదావరి సబ్ బేసిన్‌లోకి వస్తున్నట్టు గుర్తించారు. అంటే.. గోదావరిలో నీరు లభ్యమయ్యేది ప్రాణహిత-గోదావరి సంగమ ప్రాంతమైన కాళేశ్వరం తర్వాతే. దిగువ గోదావరి సబ్‌బేసిన్‌లో కాళేశ్వరం వద్ద ప్రాణహిత కలిసిన తర్వాత 40 ఏండ్ల ప్రవాహాలను గమనిస్తే ఏటా సగటున 1,651 టీఎంసీల ప్రవాహాలు ఉంటాయని తేలుతున్నది. అయితే ఈ ప్రవాహాలను వృథాగా సముద్రంలోకి వదిలేయకుండా సమర్థంగా వినియోగించుకునేందుకే గత ప్రభుత్వం కాళేశ్వరం, సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ ప్రాజెక్టులను చేపట్టింది. కృష్ణా బేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టు అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రీ డిజైన్ చేసింది. ఈ వాస్తవాన్ని మరుగుపర్చేందుకే రేవంత్ సర్కారు కుట్రకు తెరలేపింది. నాడు కేసులు వేసి పాలమూరు, డిండి, సీతారామ ఎత్తిపోతల పనులను అడ్డుకున్న కాంగ్రెస్ పార్టీయే నేడు అధికారంలోకి వచ్చాక ఆయకట్టు రాలేదని దుష్ప్రచారం చేస్తుండటం గమనార్హం.

లోతైన పరిశీలన లేకుండానే ఆరోపణలు

మేడిగడ్డ మాదిరిగా అన్నారం, సుందిల్ల బరాజ్‌లు కూడా కూలిపోతాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ వినాగం నివేదికలివ్వడం, వాటిని సాకుగా చూపుతూ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉన్నది. ఎందుకంటే.. బరాజ్‌లో కుంగుబాటుకు కారణమేమిటన్నది పునాది పరిశీలన, భూభౌతిక పరీక్షల తర్వాతే స్పష్టంగా తెలుస్తుంది. ఇప్పటికే ఆ దిశగా పనులు కొనసాగుతున్నాయని, కుంగుబాటుకు సంబంధించిన వివరాలు, కారణాలు మరో వారం రోజుల్లో తెలుస్తాయని అధికారులు చెప్తున్నారు. ఇటీవల మేడిగడ్డను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డికి అక్కడి అధికారులే స్వయంగా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కానీ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం సభ్యులు కేవలం 2 గంటలపాటు బరాజ్‌ను సందర్శించారు. పైపై పరిశీలన ఆధారంగా అనేక ఆరోపణలు, అంచనాలతోనే ఊహాజనిత నివేదికను విడుదల చేశారు. ఆ నివేదికల్లోని అంశాలను తిరస్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఇంజినీర్లు ఇప్పటికే సవివరమైన జవాబులు అందజేశారు. భూభౌతిక పరీక్షల ఫలితాలను పంపాలని డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా తెలంగాణ సర్కారుకు లేఖ రాసింది. విజిలెన్స్ అధికారులు కూడా ఎన్‌డీఎస్‌ఏ బృందం తరహాలోనే బరాజ్‌లను సందర్శించి, ఎలాంటి పరీక్షలు చేయకుండానే నివేదికను సమర్పించారు. అయినా ఆ నివేదికలే తమకు శిరోధార్యమన్నట్టు రేవంత్ సర్కారు వ్యవహరిస్తున్నది. తద్వారా గత బీఆర్ఎస్ సర్కారును బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఎంతో విలువైన ప్రాజెక్టును విఫల ప్రాజెక్టుగా చూపేందుకు పాకులాడుతున్నది. వాస్తవానికి మొత్తం 8 బ్లాకులున్న మేడిగడ్డ బరాజ్‌లో కేవలం 7వ బ్లాక్‌లో మాత్రమే కుంగుబాటు జరిగిందని, మిగతా బ్లాకులన్నీ సురక్షితంగా ఉన్నాయని అధికారులే వెల్లడిస్తున్నారు. కానీ, అందుకు భిన్నంగా అన్నారం, సుందిల్ల బరాజ్‌లు కూడా ప్రమాదపుటంచున ఉన్నాయని రేవంత్ సర్కారు దుష్ప్రచారం చేస్తున్నది. దీన్ని కట్టిపెట్టి మేడిగడ్డ పునరుద్ధరణపై దృష్టి పెడితేనే రైతులకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుంది.

పదేండ్లు కాపాడితే.. 2 నెలల్లో అప్పగింత

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు కేఆర్ఎంబీ ఆధీనంలోకి పోకుండా పదేండ్లపాటు కాపాడిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఆ ప్రాజెక్టుల అప్పగింతకు ముందస్తుగా కేంద్రానికి అనేక షరతులు విధించింది. వాటిని నెరవేర్చితే తప్ప ప్రాజెక్టులను అప్పగించేది లేదని అనేక సమావేశాల్లో తెగేసి చెప్పింది. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టుల స్వాధీనానికి కేంద్ర ప్రభుత్వం 2020 జులై 15న కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల పరిధులను నిర్దేశిస్తూ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా తిరస్కరించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2 నెలల్లోనే శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గిన రేవంత్ సర్కారు.. తన రాజకీయ స్వార్థం కోసం తెలంగాణ ప్రయోజనాలను ఢిల్లీకి తాకట్టుపెట్టింది. పైపెచ్చు ఆ తప్పును గత బీఆర్ఎస్ సర్కార్‌పై వేయాలని చూస్తున్నది. ఇదిలావుంటే, కేంద్రంతో రాజీలేని పోరాటం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. సెక్షన్ 3 కింద అదనపు నిబంధనలను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నివేదించేలా చేసింది. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన 575 టీఎంసీల వాటాను సాధించేందుకు కృషి చేయాల్సి ఉన్నది. కానీ కేంద్రం ఒత్తిళ్లకు తలొగ్గి ఇప్పటికే ప్రాజెక్టులను అప్పగించిన రేవంత్ సర్కారు మన నీటి వాటాను సాధిస్తుందా? అనే అనుమానాలు వ్యక్తం మవుతున్నాయి.

మేజర్ ప్రాజెక్టుల కింద రెండు సీజన్లకు కలిపి నీటి వినియోగం (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	2000-2014 వరకు సగటు	ప్రస్తుతం
గోదావరి బేసిన్‌లో..		
ఎస్సారెస్పీ స్టేజ్-1	103	148.39
ఎస్సారెస్పీ స్టేజ్-2	ప్రారంభమేకాలేదు	41.76
మిడ్ మానేరు	ప్రారంభమేకాలేదు	10.54
నిజాంసాగర్	10.94	21.2
సింగూరు	1.8	04
దేవాదుల	5.79	18.43
ఎల్లంపల్లి	ప్రారంభమేకాలేదు	30.3
కృష్ణా బేసిన్‌లో..		
జూరాల	19.49	19.50
ఆర్డీఎస్	5.65	9.50
నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్	123.81	140.89
మూసీ	3.5	06
రాజీవ్ భీమా	0.56	20.67
కోయిల్‌సాగర్	2.85	4.97
కృష్ణా వరద జలాల వినియోగం		
కల్వకుర్తి	0	52.89
ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ	0	47.56
నెట్టెంపాడు	0	14
మొత్తం	277.39	590.6

రైతులకు అన్యాయం చేయొద్దు

- మేడిగడ్డను భూతద్దంలో చూపి బద్నాం చేసే యత్నం
- కాంగ్రెస్ నేతలను అంటే బీజేపీకి రోషమెందుకు?
- ఉచిత బస్సు తప్ప ఒరిగిందేమీ లేదు
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం

తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో శాట్స్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత మేడిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌పై కక్షతో రైతులకు వచ్చే నీళ్ల విషయంలో అన్యాయం చేయొద్దని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే రైతులు నీళ్లు, కరెంటు కోసం ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు.ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం కింద ఉన్న రిజర్వాయర్లు, టన్నెళ్లను వాడుకునే అవకాశం ఉన్నదని స్పష్టంచేశారు. మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్ల కుంగుబాటును భూతద్దంలో చూపి గత ప్రభుత్వ తొమ్మిదిన్నరేండ్ల పాలనను బద్నాం చేసే ప్రయత్నం జరుగుతున్నదని చెప్పారు. కాళేశ్వరంపై అత్యున్నతస్థాయిలో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. గత ప్రభుత్వంపై బురదజల్లేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో హరీశ్‌రావు జవాబులకు కాంగ్రెస్ మంత్రులు, ముఖ్యమంత్రి తట్టుకోలేకపోయారని తెలిపారు. సభా సంప్రదాయాలకు భిన్నంగా ఇరిగేషన్ చర్చకు ఇతర శాఖల మంత్రులు స్పందించడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలను ఏమైనా అంటే బీజేపీ నేతలకు రోషం పొడుచుకొస్తున్నదని, రాష్ట్రంలో ఆ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయనడాన